# దొరికితే దొంగలు

గురజాడ శోభా పేరిందేవి

పని మనిషి వెళ్ళిన అరగంట దాకా తను తన వాచీని బాత్రూమ్‌లో మరచిపోయిన విషయం గుర్తు రాలేదు వందనకి!

అదైనా చాలా చిత్రంగా గుర్తొచ్చింది.

పనిమనిషి బట్టలుతికి, అంట్లుతోమి వెళ్ళిపోయింది. ఇంక వందనకి కావలసినంత తీరిక!

అందుకే హాయిగా ఓ వారపత్రిక అందుకుంది

అందుకుందంటే అంతా ఐతేకానీ వదలదు. ఈ రోజూ అలాగే పుస్తకం అందుకుని పక్కమీద వాలింది.

పుస్తకం అంతా అరగంటలో కానిచ్చేసింది.

ఇంక ఏం చెయ్యాలో ఆమెకి అర్థం కాలేదు ఇంకా చదివేందు కేమైనా మిగిలిందేమోనని ఆశగా మళ్ళీ పుస్తకమంతా ఒక్కొ పేజీ తిప్పసాగింది.

ఆమె దృష్టి ఆల్విన్ వాచీల అడ్వర్‌టైజ్‌మెంట్‌మీద పడింది.

"ఎంత బాగున్నాయో!" అనుకుంది పరిశీలనగా చూసి!

అప్పుడే హఠాత్తుగా ఆమెకి తన హెచ్. ఎమ్. టి. వాచి బాత్రూమ్‌లో ఉన్నట్టు గుర్తొచ్చింది

భర్త, పిల్లలూ వెళ్ళిపోయాక బాత్రూమ్‌కి వెళ్ళింది వందన!

టైల్స్ అన్నీ మట్టి పట్టి అసహ్యంగా కనిపించాయి. కడిగితే సరి అనుకుంది.

అప్పుడు చేతికి వాచి కనిపించింది దాన్ని తీసి గూట్లో ఉంచింది.

ఆమెకి వాచి పెట్టుకోకపోతే తోచదు. రాత్రి నిద్రపోతున్నా అది చేతిన ఉండవలసిందే!

దాన్ని తీయడం మరచిపోయి చాలాసార్లు స్నానం చేసింది కూడా!

అలాంటప్పుడు తల్లి తిట్టేది 'తీసేసి స్నానం చేయరాదుటే" అని!

అప్పుడు వందన తను తీయడం మరచిపోయిందన్న మాటని పక్కన ఉంచి, "ఇది వాటర్‌ప్రూఫ్ అమ్మా! నీళ్ళలో తడిసినా ఏం కాదు" అనేసేది అదంతా పెళ్ళికాక ముందు కథ!

ఇవాళ కూడా అలాగే చేతికే ఉంది.

కానీ యాసిడ్స్‌తో టైల్స్ కడుగుతోందాయె!" పాడైపోతేనో!"

ఆ భయంతోనే గబగబా తీసి గూట్లో ఉంచిందన్నమాట!

ఇప్పుడది గుర్తొచ్చింది

తీద్దామని బాత్రూమ్ కెళ్ళి చూసింది

లేదు!

ఆమెకి గుండె వేగంగా కొట్టుకో నారంభించింది. ఏమైందో!

తను ఇక్కడేగా పెట్టింది!

ఇంకేమవుతుంది పనిమనిషి కొట్టేసి ఉంటుంది అంది మనసు.

వెంటనే పని మనిషిని గురించి ఆలోచించ సాగింది.

అది నాలుగైదిళ్ళల్లో పాచి పని చేసి సంపాదిస్తున్నమాట నిజమే!

కాని దాని మొగుడు తాగుబోతు!

తను కూలీ పని ద్వారా సంపాదించినది, శుభ్రంగా తాగుతాడు



ఇదే తన డబ్బుతో సంసారం నడుపుతూ ఉంటుంది

కాని దాన్ని కూడా కొట్టి లాక్కుంటూ ఉంటాడు వాడు!

అందుకే అది వందనతో అంటూ ఉంటుంది." 'నాలుగు రూపాయలు చేతిలో నిలిచే మార్గమే కనిపించడం లేదు" అని!

అది కడుపుతున్న మనిషి!

దానికి ఏవేవో తినాలని కోరిక!

కనక ఇది దాని పనే అయి ఉంటుంది.

అది తీసింది సరే!

కానీ తనకి లభించే దెలాగ?

అసలది తన చేతికి వస్తుందా?

లేకపోతే కుదువ పెట్టేసి ఉంటుందా? గబగబా చెప్పు లేసుకుంది.

బయటికి వచ్చింది.

తలుపు గొళ్ళెం పెట్టింది.

ఇరుగమ్మకి ఇదీ సంగతి అంటూ తెలియ జేసింది.

ఇరుగమ్మ పొరుగమ్మకి చెప్పింది.

అయిదు నిముషాల్లో అమ్మలక్క లంతా ఆ వరండాలో చేరారు!

ఇది పని మనిషి పనే అని తీర్మానించారు.

తమ తమ ఇళ్లల్లో,

తము ఎరుగున్న వాళ్ళ ఇళ్ళల్లో పని మనుష్యులు ఎలాంటి దొంగతనాలు చేసారో చర్చించారు.

పనిమనిషి ఇంటికి కూడా వెళ్ళాలనే ఉంది అందరికీ!

## 'దొరికితే దొంగలు'

కాని ఎవ్వరికి దానిల్లు ఎక్కడ ఉందో తెలియదు.

వాళ్ళ మాట లింకా సాగుతూనే ఉన్నాయి. "అమ్మా!' పిలిచింది వందన కూతురు అప్పుడే బడి నుండి వచ్చిందా పాప

"... ... ..."

"అమ్మా నిన్నే!" మరో సారి పిలిచిందా పాప!

పలికిందిసారి వందన.

"నా కాకలేస్తోందమ్మా!" అంది

"వస్తున్నాను" అని కూతురితో అని 'మరేం చెయ్యనండి!" అని అడిగింది అందర్ని ఉద్దేశించి!

"మీ వారిని రానివ్వండి. అప్పుడు పోలీసు రిపోర్ట్ ఇవ్వండి!" అన్నారు.

'సరే' అనేసి లో పలికి నడిచిందామె!

'ఏం జరిగిందమ్మా?" అడిగింది బళ్లో చదివే కూతురు!

గబగబా చెప్పింది వందన.

"అమ్మా మరే!"

"ఊ!"

"అది దొంగెలా అవుతుంది?"

"ఎందుకు కాదే నీ ముఖం!"

"దొంగతనం చేస్తేనే దొంగకాని దొరికనది తీసుకుంటే దొంగ కాదని నువ్వు చెప్పావు గుర్తుందా?" "నేనెప్పుడు చెప్పాను?"

మనిద్దరం ఓసారి ఇందిరా పార్కుకి వెళ్లాం! అప్పుడు పార్కులో నేను వేరే పిల్లల్తో కలిసి చాలాసేపు పరిగెత్తి ఆడాను కూడా!

"ఆ తర్వాత ఇద్దరం పార్కు బయటికి వచ్చాం! అక్కడ నీకు యాభై రూపాయల నోటు దొరికింది వెంటనే బ్యాగ్‌లో పెట్టేసావు.

కొంచెం దూరమైనా వెళ్లక ముందే నేను నీకు చెప్పాను. వెనకెవరో రోడ్డంతా వంగో వంగి వెతుకుతున్నారు నువ్వు తీసిన డబ్బు వాళ్ళదేలా ఉంది అని.

కాని నువ్వు నాతో ఇంకేమి మాట్లాడలేదు.నా చెయ్యి పట్టి బరబరా లాక్కుపోయావు.

"మరి మరి అలా చూస్తే పని మనిషి కూడా దొంగ కాదమ్మా!

వందన బిత్తరపోయింది. కూతురి మాట తీరుకి!

ఆమెకి చాలా సిగ్గుగా కూడా అనిపించింది. అలా పట్టుపడినందుకు! అందుకే ఇంకా ప్రసక్తి ఎత్తలేదు.

భర్త ఆఫీసు నుండి వచ్చినా వందన పెదవి విప్పలేదు

కూతురే చెప్పింది.

"రేపు దాన్ని అడిగాక చూద్దాంలే" అన్నాడతను ఆలసటగా కుర్చీలో వాలి!

బాగా రాత్రైంది.

భోజనాలయ్యాయి.

తలుపు బాదారెవరో!

తలుపు తీసింది వందన.


ఆమె భర్తా, బిడ్డా కూడా అటొచ్చారు

పనిమనిషి నిలబడుంది




TARA-CBNPW 1325/

# భాషాసమస్య




ధర్మపథం

జ్ఞాన సంపాదనకు అవధి అనేది ఉండదు. బుద్ధిమంతులు తమకు కలిగిన జ్ఞానంతో తృప్తిపడక, ఇంకా దానిని సంపాధించడానికే ప్రయత్నిస్తూ ఉంటారు. విజ్ఞానవేత్తలు తమ ప్రతిభ వల్ల నూతనాంశాలను కనుగొన్నా తృప్తి చెందక• ఇంకా అద్భుత విషయాలు అనేకంగా కనిపెట్టడానికే ప్రయత్నిస్తారు. భాషల విషయంలో కూడా ఇదే పద్ధతి.

మన భారత దేశం వివిధ సంస్కృతులకూ, వివిధ భాషలకూ నిలయమైనది. హిందీ, మరాటీ,గుజరాతీ, బీహారీ, బెంగాలీ, ఒరియా, తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం మున్నగు భాషలు వ్యవహారంలో ఉన్నవి. ఆ యా ప్రాంతాలవారు తమ తమ మాతృభాషను ఉగ్గు పాలతో నేర్చుకుంటారు. ఇది సహజం. వారు కేవలం తమ భాషనే నేర్చుకొని, యితర భాషలు నేర్చుకోకపోతే చిక్కులు కలుగుతాయి. ఏమంటే, వారు కూపస్థమండూకాల వలె తమ దేశంలో నే ఉండరు గదా! ఇతర ప్రాంతాలకు వెళ్ళినప్పుడు, అక్కడ భాష రాకపోతే పడే శ్రమ అనుభవజ్ఞులకే తెలుస్తుంది. అందువల్ల ఇతర భాషలను నేర్చుకోవడం కూడా ఎంతో అవసరం.

ఇతర ప్రాంతాల వారిని మనం స్నేహభావంతో చూడాలి. వారితో విరోధం తగదు. ఆ రీతినే ఇతర భాషలపై ద్వేషం పెట్టుకోవడం కూడా తగదు.

సాధారణ జ్ఞానం వలె భాషా జ్ఞానానికి గూడా పరిమితి లేదు. ఎన్ని భాషలయినా నేర్చుకో వచ్చును. ఆ యా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలలో ఉన్న వారికి అప్రయత్నంగా రెండు భాషలూ వస్తాయి. దక్షిణ ప్రాంతం తెలుగు వారికి తమిళం, కర్ణాటక సరిహద్దులలో ఉన్నవారికి తెలుగుతో పాటు కన్నడం, ఉత్తరాంధ్రం సరిహద్దు వారికి ఒరియా సులభంగానే వస్తాయి. బహు భాషాభిజ్ఞత్వం దేశైక్యతకు తోడ్పడుతుంది. సంకుచితభావాలు దూరమై పోతాయి. సుప్రసిద్ధులైన విద్వాంసులు, దేశ నాయకులు రెండూ, మూడూ కాదు. ఎన్నో భాషలు ఎరిగి ఉన్న సంగతి మనకు తెలియనిది కాదు. ఇతర భాషలలో ఆసక్తి లేక, సంకుచిత భావాలు ఉన్నప్పుడే భాషా సమస్యలు తల లెత్తుతాయి. పరస్పర విరోధాలకు దారి తీస్తాయి. వాట వల్ల ఎన్నో అనర్థాలు ఏర్పడతాయి. ఈ భాషా సమస్య తీరడానికి ఇతర భాషలు కూడా రావడం ఎంతో అవసరం.

– బులుసు వేంకట రమణయ్య

---

ఆమె చేతిలో వాచి!

ముగ్గురి ముఖాలూ తళుక్కుమన్నాయి.

ఆమె ఆయాస పడ్తోంది! చెమటల్తో తడిసి ఉంది అయినా చెప్పింది "ఇదిగోనమ్మా! నాతో పాటు పనికొచ్చిన నా కొడుకు దిన్ని తీసుకు వచ్చాడుట'

ఆ సంగతి నాకు ఇందాకే తెలిసి వుంటే ఎప్పుడో తెచ్చి ఇచ్చేదాన్ని

ఇప్పుడిప్పుడే నా మొగుడు ఇంటికి వచ్చాడు.

బాగానే తాగి ఉన్నాడు.

కాని నన్ను డబ్బడిగాడు.

ఇంకా తాగాలనే అని నాకు తెలుసు

లేదన్నాను నిజంగా కూడా నా దగ్గర లేదు.

కాని ఊరుకోలేదు.

ఇష్టం వచ్చినట్టు బాదసాగాడు నన్ను!

నా తల బొప్పి కట్టింది.

గాజులు చిట్లాయి

ఇంతలో నా కొడుకు ఉన్నట్టుండి అరిచాడు.

"నాన్నా! అమ్మనింక కొట్టకు! ఇదిగో ఈ వాచి తీసుకుపో! ఇందాకా పని చేసిన వాళ్ళింట్లో దొరికితే తెచ్చాను' అన్నాడు.

నాకు వెంటనే విషయం అర్థమైపోయింది.

అవును మరి ఇందాకా బాత్రూమ్‌లో నేనూ దాన్ని చూసినదాన్నే!

అందుకే గబుక్కున వాడి చేతుల్లోంచి వాచి లాక్కున్నాను.

పరుగుపెట్టాను

ట్రాఫిక్‌ని, కాని నా ఒళ్ళు నెప్పులని కాని, వెంటాడుతున్న మొగుడ్ని కానీ పట్టించుకోలేదు.

నా కోరిక ఒక్కటే నాకు చెందని ఈ వస్తువు నా దగ్గర ఉండడానికి వీల్లేదు! అలా నేను ఉండనివ్వను

నా బిడ్డని దొంగగా మార్చలేను నేను.

వాడికి అది తప్పని తర్వాత చెప్తాను.

నా వెనక వస్తున్న నా భర్త నేనిది ఇచ్చేసానన్న కోపంతో నన్ను చంపినా సరే!

నా నీతిని మాత్రం నేను చావనివ్వను"

చిరిగిన బట్టలు చెమటలకి ఒంటికి అతుక్కున్నాయి.

జుట్టు రేగి ఉంది ముఖమంతా గాట్లు, కమిలిన గుర్తులూ!

కానీ ఆ మాటల్లో ఎంత నిజాయితీ!

"ఎందరో దొంగలున్నారు. ఈ దరిద్ర ప్రపంచంలో! కాని దొరికిందాకా అంతా దొరలే!" అంది వందన ఓసారి కూతురితో!

కాని ఇప్పుడు జరిగినదేమిటి, ఆలోచిస్తోంది అలాగే నిలబడి వందన

(ఈ కలికాలంలో న్యాయం, నీతి, నిద్రలు పోతున్న మాట నిజమే!

కానీ అవి నిర్జీవం కాకుండా నిలుపుతున్నది కేవలం ఇలాంటి కొందరు వ్యక్తులే!) □